## నేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

మెదక్ మున్సిపాలిటీ, జూలై 22: మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో టీఎస్‌కేసీ, ఇండస్‌ఇండ్ బ్యాంకు సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాకు 18 నుంచి 30 ఏండ్లలోపు వయస్సు కలిగి ఇంటర్మీడియట్ ఉతీర్ణులై, ద్విచక్ర వాహనం కలిగి ఉండి డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వారు జాబ్ మేళాలో పాల్గొనాలని సూచించారు.

## కొండపోచమ్మ కాల్వను రద్దు చేయాలి

నర్సాపూర్, జూలై 22: కొండపోచమ్మ కాల్వను రద్దు చేసి భవిష్యత్ తరాలకు మేలు చేయాలని రైతులు కోరారు. నర్సాపూర్‌లోని అంబేద్కర్ చౌరస్తాలో కొండపోచమ్మ కాల్వలో భూములు కోల్పోతున్న రైతులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష సోమవారంతో 11వ రోజుకు చేరింది. దీక్షలో జగ్యాతండా, చెన్నాపూర్, పెద్దచింతకుంట, చిన్నచింతకుంట రైతులు పాల్గొన్నారు.

### బోనాలు ఘనంగా నిర్వహించాలి

నర్సాపూర్, జూలై 22: బోనాలను ఘనంగా నిర్వహించాలని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయంలో బోనాల పండుగ నిర్వహణ కోసం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ నెల 28, 29 తేదీల్లో బోనా పండుగ నిర్వహించేందుకు నిర్ణయించడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జైత్‌రామ్ నాయక్, ఏవో చంద్రవేణి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, కౌన్సిలరు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

రేగోడ్, జూలై 22: రైతుబీమా కోసం 18 నుంచి 59 వయస్సున్న వారు ఆగస్టు 4వ తేదీలోగా తమ దరఖాస్తులను అందజేయాలని ఏవో జావీద్ తెలిపారు. సంబంధిత పత్రాలు రైతుబీమా దరఖాస్తు ఫారమ్, పట్టాపాస్ బుక్, ఆధార్‌కార్డు,నామిని ఆధార్ కార్డు జిరాక్స్‌లు పట్టాదారు స్వయంగా వచ్చి వ్యవసాయ విస్తరణ అధికారికి అందజేయాలన్నారు. ఇంతకు ముందు బీమా ఉన్నవారు అవసరం లేదన్నారు. బీమాలో తప్పులుంటే సవరణలకు ఈ నెల 29 తేది వరకు అందజేయాలన్నారు.

### విద్యుత్ షాక్‌తో లైన్‌మెన్ మృతి


గణేశ్ (ఫైల్)

అల్లాదుర్గం, జూలై 22: విద్యుత్ షాక్‌తో జూనియర్ లైన్‌మెన్ గణేశ్(24) మృతి చెందిన ఘటన అల్లాదుర్గంలో సోమవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అల్లాదుర్గం గ్రామానికి చెందిన గణేశ్ మండలంలోని వెంట్రావుపేట, రెడ్డిపల్లి గ్రామాల్లో లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రాంపూర్ ఫీడర్‌కు సరఫరా అవుతున్న విద్యుత్‌లో అంతరాయం ఏర్పడింది. దీంతో అల్లాదుర్గం సమీపంలో 161వ జాతీయ రహదారి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేయడానికి గణేశ్, స్థానిక లైన్‌మెన్ రామకృష్ణతో కలిసి వెళ్లాడు. మరమ్మతులు చేస్తున్న క్రమంలో విద్యుత్ సరఫరా కావడంతో గణేశ్ షాక్‌కు గురై కిందపడిపోయాడు. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌రెడ్డి తెలిపారు.

## సైబర్ నేరాలపై అవగాహన



రేగోడ్, జూలై 22: మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద సైబర్ నేరాలపై ఎస్సై రాజయ్య అవగాహన కల్పించారు. సోషల్ మీడియాలో వచ్చిన తప్పుడు యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దన్నారు. ఓటీపీని ఎవరు అడిగినా చెప్పొద్దని, ఆధార్ నెంబరు, ఏటీఎం నెంబరు పాస్ వర్డులు చెప్పొదని తెలిపారు. ఫోన్‌కు హైసెక్యూరిటీ పాస్‌వర్డులు పెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై మల్లయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
WATER PROOFING
★ Roof & Wall Crack Filling, Water Proofing Coatings, New & Old Bhathrooms Leakages, Water Tank & Sump Leakages, Rain Coat & Pest Control, Slab & Beems Injection Work, 10 years Waranty. Call: 9010425273, 8121425273.
NT-326124
WANTED
★ బ్యాంకు బ్యాలన్స్ '0' చూపిస్తుందా? ఐతే మీ చేతుల్లోనే ఉంది బ్యాలెన్స్‌ను పెంచుకొనే చిట్కా. వెంటనే కాల్ చేయండి. స్త్రీ/పులు నో ఏజ్ లిమిట్. సంప్ర: 8919302962, 7702925337.
NT-339541
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందాలి

- అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించాలి
- ప్రభుత్వ పథకాల పనుల పురోగతిపై సమీక్షించాలి
- కలెక్టర్ రాహుల్ రాజ్


మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, జూలై 22 (నమస్తే తెలంగాణ): అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తూ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. సోమవారం ఐడీవోసీ కార్యాలయ సమావేశ హాలులో ప్రజావాణి అనంతరం వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. పనులు, పురోగతి, ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులు, పరిష్కారం జిల్లా అధికారులు సంబంధిత శాఖల పనితీరు రివ్యూలు, క్షేత్రస్థాయి పర్యటనలు, తదితర అంశాలు, మౌలిక సదుపాయాలు కల్పనపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని, జిల్లా అధికారులు ఆయా శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పర్యటించి లోటుపాట్లను సవరించుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ఆశ, ఏఎన్ఎం, పంచాయతీ సెక్రటరీ పనిచేయాలన్నారు. వనమహోత్సవం విజయవంతంగా కొనసాగుతుందని, లక్ష్యాలు పూర్తి చేయాలన్నారు. మహిళా శక్తి పథకం అమలుచేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఆర్‌డీవో పీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి


మెదక్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ

మెదక్ అర్బన్, జూలై 22: అర్జీదారుల సమస్యలు త్వరగా పరిష్కరించాలని జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ మహేందర్ అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో ప్రజావాణి నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజలు నిర్భయంగా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీస్ సేవల్ని వినియోగించుకోవాలన్నారు. వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకోవాలని సూచించారు.

**నర్సాపూర్‌లో..**

నర్సాపూర్,జూలై22: ప్రజల సమస్యలను పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం నర్సాపూర్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో గ్రీవెన్స్ డేలో భాగంగా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్డీవో కార్యాలయంలో 5, నర్సాపూర్ తహసిల్‌లో 1, చిలిపిచెడ్ తహసిల్‌లో 1 మొత్తం 7 ఫిర్యాదులు రావడం జరిగిందని వెల్లడించారు. త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వెల్లడించారు.

**డంపింగ్ యార్డ్‌కు స్థలమివ్వండి**

కొల్చారం, జూలై 22: మండలంలోని అప్పాజీపల్లి పంచాయతీకి డంపింగ్ యార్డ్ స్థలం ఇవ్వాలని ఎంపీడీవో లక్ష్మీనర్సింహులు కోరారు. ఏవో శ్వేతకుమారి, పంచాయతీ సెక్రటరీ ఫణీంద్ర కృష్ణతో కలిసి ప్రజావాణిలో తహసీల్దార్ గఫర్‌మియాకు వినతి పత్రం అందజేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ 2020లో అప్పాజీపల్లికి 20 గుంటల స్థలం కేటాయిస్తు తహసీల్ కార్యాలయం ధ్రువపత్రం అందజేశారని, ఇప్పుడు ఆ స్థలం మైనింగ్ శాఖకు కేటాయించినట్లు 2022లో అనుమతి ఇచ్చారని, అక్కడ మైనింగ్ చేసే వ్యక్తులు తమ పత్రాలు చూపిస్తున్నారన్నారు. ఫారెస్ట్‌లో డంప్ చేస్తే అటవీ అధికారులు అడ్డుకుంటున్నారన్నారు. మరోచోట డంపింగ్ యార్డ్‌కు స్థలాన్ని కేటాయించాలని కోరారు.

# టీఎల్‌ఎంతో మెరుగైన ఫలితాలు రాబట్టాలి


నర్సాపూర్‌లో టీఎల్‌ఎమ్‌లను పరిశీలిస్తున్న సర్వశిక్ష అభియాన్ జాయింట్ డైరెక్టర్ రాజీవ్


బాలికల పాఠశాలలో టీచర్ లెర్నింగ్ మెటీరియల్‌ను పరిశీలిస్తున్న డీఈవో రాధాకిషన్

నర్సాపూర్, జూలై 22: టీఎల్ఎమ్ (టీచింగ్, లర్నింగ్, మెటీరియల్స్)తో అనుసంధానించి విద్యార్థులకు రోజూ పాఠ్యాంశాలు బోధించాలని సర్వశిక్ష అభియాన్ జాయింట్ డైరెక్టర్ రాజీవ్ తెలిపారు. సోమవారం మండలంలోని బంజారానగర్ ఎంపీపీఎస్ పాఠశాలను స్టేట్ మానిటరింగ్ ఆఫీసర్ వెంకటస్వామి, ఎంఈవో బుచ్చానాయక్‌తో కలిసి సందర్శించారు. టీఎల్ఎమ్ మేళాలో విద్యార్థులకు టీఎల్ఎమ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం అరుణ, ఉపాధ్యాయులు రవి, అవతారం, స్వామి పాల్గొన్నారు.

**పాఠశాలలో శిక్షా సప్తహ్ కార్యక్రమం**

పెద్దశంకరంపేట, జూలై 22: అన్ని పాఠశాలలో శిక్షా సప్తహ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జడ్పీహెచ్ఎస్ (బాలికల)లో నిర్వహించిన కార్యక్రమంలో మండల నోడల్ అధికారి వెంకటేశం పాల్గొన్నారు. టీఎల్ఎం మేళాను పరిశీలించారు. వ్యాస రచన పోటీలు నిర్వహించి వ్యర్థాలతో బొమ్మల తయారీ, నీటి సంరక్షణ, పొదుపుపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయుడు సిద్ది రాములు ఉన్నారు.

**అర్థమయ్యేరీతిలో విద్యాబోధన ఉండాలి: డీఈవో**

కొల్చారం, జూలై 22: టీచర్ లెర్నింగ్ మెటీరియల్ ఆధారంగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని డీఈవో రాధాకిషన్ అన్నారు. శిక్ష సప్తహ్ వారోత్సవాల్లో భాగంగా కొల్చారంలోని జడ్పీహెచ్ఎస్ (బాలుర, బాలికల), కేంద్ర ప్రాథమిక పాఠశాలలను డీఈవో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీచర్ లెర్నింగ్ మెటీరియల్ ఉపయోగించి విద్యార్థులకు బోధన చేయాలని ఉపాధ్యయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో నీలకంఠం, సుదర్శనమూర్తి, కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీధర్, ఉపాధ్యయురాలు శశికళ, సఫియా, సీఆర్‌పీ సాయికుమార్, విద్యార్థులు ఉన్నారు.

**పాపన్నపేటలో..**

పాపన్నపేట, జూలై 22: టీఎల్ఎంతో మెరుగైన ఫలితాలు రాబట్టాలని ఎంఈవో నీలకంఠం సూచించారు. జాతీయ విద్యావిధానం ప్రారంభించి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న శిక్ష సప్తాహ కార్యక్రమం నాగ్సాన్‌పల్లి, గాంధారిపల్లి, యూసూఫ్‌పేట ఉన్నత పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఆయనతో ఇన్‌చార్జి హెచ్ఎం నజీరుద్దీన్, అశోక్‌కుమార్, సిద్దేవర్ ముజీబ్, రేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు

## నేరాలు అరికట్టడానికి చర్యలు చేపట్టాలి

**-ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి**


సమీక్షలో ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి

తూప్రాన్, జూలై 22: నేరాలు అరికట్టడానికి చర్యలు చేపట్టాలని, కేసులు సత్వరం పరిష్కరించాలని ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం తూప్రాన్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా తూప్రాన్‌కు విచ్చేసిన ఆయన డీఎస్పీ కార్యాలయంలోని డివిజన్ పరిధిలో ఉన్న సబ్ ఇన్‌స్పెక్టర్లతో క్రైమ్ రివ్యూ నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు, దొంగతనాల నివారణకు చర్యలు తీసుకుంటామని, యువతను పెడదోవ పట్టిస్తున్న డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం మోపుతామన్నారు. నేరాలను అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. సమావేశంలో డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ రంగ కృష్ణ, ఎస్సైలు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ


మాజీ సర్పంచ్ సామ్యానాయక్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, జూలై 22: మండలంలోని తుల్జారాంపేట్ మాజీ సర్పంచ్ సామ్యానాయక్ సతీమణి అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి బాధిత కుటుంబీకులకు పరామర్శించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, బీఆర్ఎస్ నాయకులు బాబ్యానాయక్, లాఖావత్ రమేశ్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, షేక్ హుస్సేన్, కర్నాకర్, అశోక్‌గౌడ్, రూప్‌సింగ్, పుణ్యానాయక్, హరిసింగ్ తదితరులు ఉన్నారు.

**కౌడిపల్లిలో..**

కౌడిపల్లి, జూలై 22: వివిధ కారణలతో మృతి చెందిన వారి కుటుంబాలను ఎమ్మెల్యే సునీతారెడ్డి సోమవారం పరామర్శించారు. మండలంలోని ధర్మాసాగర్, దేవులపల్లి గ్రామాల్లోని బాధిత కుటుంబీకులను ఎమ్మెల్యే పరామర్శించి, ఓదార్చారు. అధైర్యపడొద్దని, తన వంతు సాయం అందజేస్తామని ఆ కుటుంబాలకు భరోసా ఇచ్చారు. ఆమె వెంట మాజీ ఎంపీపీ రాజునాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామాగౌడ్, మాజీ సర్పంచ్ ఎల్లం, దుర్గారెడ్డి, నవీన్, సందీప్ ఉన్నారు.


కౌడిపల్లిలో బక్షానాయక్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

## స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి

**- జాతీయ దివ్యాంగుల హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు**

మెదక్ మున్సిపాలిటీ, జూలై 22: దివ్యాంగులను కించపరిచేలా మాట్లాడిన స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని జాతీయ దివ్యాంగుల హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్, అడివయ్య సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ సర్వీసులో దివ్యాంగులకు రిజర్వేషన్ ఎందుకివ్వాలని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ప్రశ్నించడం ఆమె అవివేకానికి నిదర్శనమన్నారు. ఆమె ప్రకటన దివ్యాంగుల హక్కుల చట్టం– 2016 మార్గదర్శకాలకు వ్యతిరేకంగా ఉందన్నారు. స్మితా సబర్వాల్ వెంటనే దివ్యాంగులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం వెంటనే ఆమెపై చర్యలు తీసుకోవాలన్నారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని ఆర్‌పీడబ్ల్యూడీ రాష్ట్ర కమిషనర్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేశామని తెలిపారు.

**వికలాంగులకు క్షమాపన చెప్పాలి**

చిన్నశంకరంపేట,జులై22: ఉన్నత స్థాయిలో ఉండి, వికలాంగులను కించపరిచిన ఐఏఎస్ అధికారి స్మితాసబర్వాల్ బహిరంగ క్షమాపణ చెప్పాలని మండల దివ్యాంగులు డిమాండ్ చేశారు. దివ్యాంగుల చట్టం ప్రకారం న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దివ్యాంగులు దేవరాజ్, శంకర్, పాండు, భూమయ్య, దత్తు, యాదగిరి, సిద్దిరాములు తదితరులు పాల్గొన్నారు.

## బోనాల జాతరకు మంత్రికి ఆహ్వానం




తూప్రాన్, జూలై 22: ఈనెల 28వ తేదీ నుంచి మూడు రోజులు తూప్రాన్‌లో ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాలను ఘ నంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నా రు. సోమవారం మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. యూత్ కాంగ్రెస్ నాయకురాలు ఆంక్షరెడ్డి, మత్స్యశాఖ డైరెక్టర్ గడప దేవేందర్ తదితరులున్నారు.


## తిరుపతికి వెళ్లొస్తానని.. వ్యక్తి అదృశ్యం

తూప్రాన్, జూలై 22: తిరుపతికి వెళ్లొస్తానని చెప్పి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. తూప్రాన్ ఎస్సై శివానందం తెలిపిన వివరాల ప్రకారం .. పట్టణానికి చెందిన మహల్‌దార్ సుధాకర్ (40) గత నెల 28న తిరుపతికి, అక్కడ నుంచి విజయవాడకు వెళ్లొస్తానని, తన చిన్న కుమారుడు ఆనంద్‌తో చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. మూడు వారాలు గడుస్తున్నా సుధాకర్ ఇంటికి తిరిగి రాకపోవడం తో అతడి భార్య శోభ, బంధువులు, స్నేహితుల ఇండ్ల వద్ద వెతికింది. సుధాకర్ తాగుడుకు బానిసై, ఏ పని చేసేవాడు కాదని, ఇదే విషయమై చాలాసార్లు పెద్దల సమక్షంలో గొడవలు జరిగినా తీరు మారలేదని, ఫోన్ వాడకపోవడంతో అతడి ఆచూకీ తెలియట్లేదని శోభ తెలిపింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలి


చిలిపిచెడ్‌లో ..


నిజాంపేటలో..


మెదక్ తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ, ఓబీసీ మోర్చా నాయకులు

మెదక్ మున్సిపాలిటీ/నిజాంపేట/చిలిపిచెడ్/తూప్రాన్/ చిన్న శంకరంపేట, జూలై 22: బీసీ డిక్లరేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం కాశీనాథ్ డిమాండ్ చేశారు. సోమవారం మెదక్ తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోపే కులగణన చేసి బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. బీసీ రిజర్వేషన్లు 23 నుంచి 42 శాతానికి పెంచుతామని, ఇప్పుడు కాలయాపన చేయడం తగదన్నారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలుచేయాలన్నారు.

## మెదక్ వైద్య కళాశాలలో ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మెదక్, జూలై 22 (నమస్తే తెలంగాణ): మెదక్ ప్రభుత్వ వైద్య కళాశాలలో కాంట్రాక్ట్ ప్రతిపాదికన ప్రొఫెసర్లు–25, అసోసియేట్ ప్రొఫెసర్లు–28, అసిస్టెంట్ ప్రొఫెసర్లు–56 భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రవీంద్ర కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఎండీ/ఎంఎస్/ డీఎన్బి, పీజీ డిగ్రీలో సాధించిన మార్కులు, ట్యూటర్ పోస్టులకు ఎంబీబీఎస్‌లో సాధించిన మార్కులు అర్హత పరీక్షలో 50 శాతం మార్కులు పరిగణలోకి తీసుకుంటామని పేర్కొన్నారు. ట్యూటర్ సీనియర్ రెసిడెంట్ పోస్టులకు దరఖాస్తుదారుడి వయసు 45 ఏళ్లలోపు ఉండాలని, స్థానిక అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రొఫెసర్ల వేతనం రూ.లక్షా90వేలు ఉంటుందని, అసోసియేట్ ప్రొఫెసర్లకు రూ. లక్షా 50వేలు, అసిస్టెంట్ ప్రొఫెసర్లకు రూ. లక్షా25వేలు ఉంటుందని పేర్కొన్నారు. వేరే రాష్ట్ర అభ్యర్థుల తమ నియామకాన్ని ధ్రువీకరించడానికి ఎంపికైన వారం రోజుల్లోగా స్టేట్ మెడికల్ కౌన్సిల్ నుంచి అర్హతను నమోదు చేసుకోవాలని సూచించారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో రెండు సెట్లు, ఈ నెల 25న ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మెదక్ జిల్లా ప్రభుత్వ దవాఖానలోని పర్యవేక్షక చాంబర్‌లో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని తెలిపారు.

## కబ్జాకు యత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి


పురుగు మందు డబ్బాతో ఆందోళన చేస్తున్న రైతులు

రామాయంపేట, జూలై 22: తమ పట్టా భూమిని ఇద్దరు వ్యక్తులు కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు రామాయంపేటకు చెందిన అన్నమైన మల్లయ్య, అన్నమైన రాజయ్య సోమవారం ఫిర్యాదు చేశారు. వారు తమ భూమిలోకి వస్తే మూకుమ్మడిగా ఆత్మహత్యకు పాల్పడుతామని తహసీల్ కార్యాలయం ఎదుట పురుగు మందు డబ్బాతో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము 25 ఏండ్లుగా భూమిని సాగు చేసుకుంటున్నామన్నారు. ఇద్దరు వ్యక్తులు తమ భూమిలోకి వచ్చి భేషరతుగా విడిచి వెళ్లాలని బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. తమ భూమిలోకి పైపులైన్ వేసి సాగు చేసుకుంటున్నారన్నారు. ఆ ఇద్దరు వ్యక్తుల ద్వారా తమకు ప్రాణహాని ఉన్నదని, వారిపై చర్యలు తీసుకోవాలని కో రారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ బాధితుల వద్దకొచ్చి వివరాలు తెలుసుకున్నారు. ఈ పరిష్కారం కోసం కోర్టులో తేల్చుకోవాలని సూచించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సదరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రంజిత్ తెలిపారు.

# పలు హోటళ్లలో తనిఖీలు



తూప్రాన్‌లోని గోల్డెన్ హోటల్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తౌర్యా నాయక్

తూప్రాన్, జూలై 22: తూప్రాన్‌లో హైస్కూల్ ఎదురుగా ఉన్న మండీ స్పాట్ హోటల్‌లో ఇటీవల బిర్యానీ తిన్న పలువురు అస్వస్థతకు గురై దవాఖాన పాలైన ఘటన నేపథ్యంలో తూప్రాన్ పట్టణంలోని శుభం మెస్, గోల్డెన్ హోటళ్లలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ తౌర్య నాయక్, మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్‌తో కలిసి సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఫుడ్ పాయిజన్ ఘటనకు కారణమైన మండీ స్పాట్ హోటల్‌ను సీజ్ చేశారు. పట్టణంలో సుమారు 50కి పైనే దాబాలు, టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, స్వీట్‌హౌజ్‌లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు ఉన్నాయి. రెండు హోటళ్లలో మాత్రమే తూతూ మంత్రంగా తనిఖీలు చేశారని స్థానికంగా ఆరోపణలు ఉన్నాయి.

## కేసీఆర్ కాలనీకి రోడ్డు సౌకర్యం కల్పిస్తాం

రామాయంపేట, జూలై 22: గతుకుల రోడ్డుతో ఇబ్బందులకు గురవుతున్న కేసీఆర్ కాలనీ వాసులకుక రోడ్డు సౌకర్యం కల్పిస్తానని పురపాలిక చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్, కమిషనర్ దేవేందర్ తెలిపారు. సోమవారం ప్రభుత్వ దవాఖాన నుంచి కేసీఆర్‌కాలనీ వరకు కాలినడకన చేరుకుని సందర్శించారు. అనంతరం కాలనీలో చైర్మన్ మాట్లాడుతూ గతేడాదిగా రోడ్డులేక ఇబ్బందులకు గురవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. తొందర్లోనే కాలనీకి మట్టి రోడ్డును వేయిస్తానని చైర్మన్, కమీషనర్‌లు కాలనీ ప్రజలకు హామీ ఇచ్చారు.


# గ్రామ సింహాల స్వైర విహారం


రోడ్డుపై ఉంటూ ప్రజల వెంట పడుతున్న కుక్కల గుంపు


కుక్క కరవడంతో గాయపడ్డ నాగయ్య

చిలిపిచెడ్, జూలై 22: చిలిపిచెడ్, బండపోతుగల్, అజ్జమర్రి, చండూర్, చిట్కుల్, నర్సాపూర్, జోగిపేట రహదారిపై గ్రామ సింహాలు (కుక్కలు)ప్రజలు, ప్రయాణికులను భయానికి గురి చేస్తున్నాయి. ప్రధాన రహదారిపై గుంపులుగా సంచరిస్తూ అటు వైపుగా వెళ్లే వాహనదారులు, పిల్లలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. బండపోతుగల్‌లో ముగ్గురికి చండూర్‌లో ఒక్కరికి కుక్కలు కరవడంతో గాయాలపాలై జోగిపేట ప్రభుత్వ దవాఖానలో చికిత్స చేయించుకుంటున్నారు. రహదారిపై చికెన్ దుకాణాలు నడుపుతున్న వ్యక్తులు వ్యర్థాలను రోడ్డుపై పడేయడంతోనే ఇలా చేస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## అక్రమ పట్టాదారులపై చర్యలు తీసుకోవాలి


శివ్వంపేటలో మాట్లాడుతున్న బాధిత రైతులు

శివ్వంపేట, జులై 22: తమ భూమిని అక్రమంగా పట్టా చేసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని బిజిలీపూర్ బాధితులు తహసీల్దార్ శ్రీనివాస్‌చారికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో మహమ్మద్ హుస్సేన్ పేరిట సర్వేనెంబర్ 88/2 లో 1.14 గుంటల భూమి ఉంది. హైదరాబాద్‌కు వలసవెళ్లగా తమ పట్టా భూమిలో పలకలు వేసి ఆక్రమించుకున్నారన్నారు. నకిలీ పట్టా పుస్తకాలు సృష్టించి భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నారన్నారు. తమకు న్యాయం చేయాలని తాహసీల్దార్‌ను కోరినట్లు తెలిపారు. ఈ విషయంలో తహసీల్దార్ స్పందించి విచారణ చేసి తప్పకుండా చర్యలు చేసుకుంటామని తెలిపారు.

## మత్తడి దూకుతున్న కాల్వ



చిన్నశంకరంపేట, జూలై 22: రెండు రోజులుగా కురిసిన వానకు చెరువుల్లోకి నీరు చేరింది. రైతులు నాట్లు వేస్తున్నారు. మండలంలోని చెన్నాయపల్లి వద్ద ఉన్న సున్నం మత్తడి కాల్వ వర్షం నీరు చేరి మత్తడి దూకుతున్నది. కాల్వ నీరు అంబాజిపేట, చిన్నశంకరంపేట శివారును కలుపుతూ పెద్ద చెరువుకు చేరుతున్నది.